మానుకోట మునిసిపాలిటీకి
రూ.59.62 కోట్ల నిధులు
ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ కార్యదర్శి శ్రీదేవి 8



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
MAHABUBABAD
సోమవారం 27 అక్టోబరు 2025



ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలి

మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలో ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి, అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని.. తక్షణమే ఖాళీ ప్లాట్ల యాజమానులు వారి స్థలాలను శుభ్రం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో ఆదివారం ఖాళీ స్థలాల యాజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం పెరిగి చుట్టు నివాసముంటున్న ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ఖాళీ స్థలాల యజమానులకు మునిసిపల్ ఆఫీస్ నుంచి నోటీసులు జారీ చేయగా, అందులో కొంత మంది శుభ్రం చేయించారని చెప్పారు. మిగత వారు కూడా వెంటనే శుభ్రం చేయించాలని లేని పక్షంలో మునిసిపాలిటీ స్థలాలను శుభ్రం చేసి అది మునిసిపాలిటీ స్థలంగా బోర్డును ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మేనేజర్ శ్రీధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు కరుణాకర్, రాజేష్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్



- తెల్లబంగారం అమ్మకాల్లో ఇబ్బందులు
- ఇంకా పూర్తికాని సాఫ్ట్‌వేర్ లోడింగ్, క్రాప్ బుకింగ్
- జిల్లా పరిధిలోనే సీసీఐ కొనుగోళ్లు
- కపాస్ కిసాన్ యాప్‌తో ఇక్కట్లు
- పాత పద్ధతిలోనే ఖరీదు చేయాలి: జిన్నింగ్ మిల్లుల యాజమానులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ కొనుగోళ్లు ఇంకా ఆలస్యం కానున్నాయి. జిన్నింగ్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఇంకా సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ కాకపోవడంతో మరికొన్ని రోజుల సమయం పట్టే అవకాశాలున్నాయి. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం సమావేశం ఏర్పాటు చేసి, పత్తి కొనుగోళ్ల ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. మరోపక్క కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కొనుగోళ్ల విధానం కపాస్ కిసాన్ యాప్ వల్ల జిల్లా పరిధి లోనే సీసీఐ అమ్మకాల నిబంధనలతో రైతులకు ఇబ్బం దులు ఎదురుకానున్నాయి. మరోపక్క మహబూబాబాద్, కేసముద్రంల్లోని జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు కూడా ఈ విధానం వల్ల నష్టపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గురువారం జిల్లా అధికారులకు అందించారు.

ఆరు జిన్నింగ్ మిల్లుల్లో ఖరీదులు..

మహబూబాబాద్ జిల్లాలోని ఆరు జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఖరీదులు చేయడానికి అధికార యంత్రాంగం అనుమతి ఇచ్చింది. మహబూబాబాద్ సమీపంలో ఒకటి, కేసముద్రం మార్కెట్ పరిధిలో కేసముద్రంలో రెండు, మరొకటి మరిపెడ మండలం బుర్హాన్‌పురంలోని, తొర్రూరు మార్కెట్ పరిధిలో నర్సింహుల పేట మండలంలోని పడమటిగూడెం, పెద్దవంగర మండలంలోని చిన్నవంగరలో జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఖరీదులు చేపడుతారు. నెల్లికుదురు మండలం శ్రీరామ గిరిలో మరో కొత్త జిన్నింగ్ మిల్లు నిర్మాణం పూర్తయింది. ఈ జిన్నింగ్ మిల్లులో కూడా పత్తి ఖరీదులు చేయడానికి సీసీఐ జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు కోరనుంది. మరో రెండు, మూడ్రోజుల్లో ఆ మిల్లుకు కూడా పత్తి కొనుగోళ్లకు అనుమతి లభించనున్నట్లు తెలుస్తోంది. సీసీఐ పత్తి కొనుగోళ్లకు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లకు సంబంధించిన కంప్యూటర్‌లలో సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లా అధికార యంత్రాంగం సీసీఐ కొనుగోళ్లకు సిద్ధంగా ఉంది. గురువారం రోజున తొర్రూరులోని రెండు జిన్నింగ్ మిల్లుల్లోని కంప్యూటర్‌లలో సాఫ్ట్‌వేర్ లోడ్ చేయగా కేసముద్రం, మహబూబాబాద్ పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో ఇంకా సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేయలేదు. దాంతో ఆలస్యం జరుగుతోంది.

గతేడాదిలో పత్తిరైతు ఇలా..

గతేడాది పండించిన రైతులు రాష్ట్రంలో ఎక్కడైనా తనకు నచ్చిన చోట పత్తిని అమ్ముకునే వీలు ఉండేది. అలాంటిది ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానం కపాస్ కిసాన్ యాప్ వల్ల ఏ జిల్లా రైతులు ఆ జిల్లాలోనే అమ్ముకోవాలనే నియమనిబంధనలు ఉన్నాయి. దాంతో మరో జిల్లా రైతులు వేరే జిల్లాలోకి ప్రవేశించి అమ్ముకునే వీలు లేదు. కాగా, ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, నల్గొండ జిల్లాకు చెందిన రైతులు జిల్లాలోని జిన్నింగ్ మిల్లులకు వచ్చి అమ్ముకునే వారు పది, పదిహేనేండ్ల నుంచి ఆ రైతులతో జిన్నింగ్ వ్యాపారులకు తత్సంబంధాలు ఉండేవి. దీంతో ఈ విధానం వల్ల సంబంధాలు తెగిపోయే ప్రమాదం ఉంది.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాంచంద్రునాయక్

దంతాలపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం దంతాలపల్లి మండల కేంద్రం, పడమటిగూడెం శివారులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు పండించిన పత్తి పంటను కొనేందుకు కపాస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. నేరుగా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని తెలిపారు. మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. తేమశాతం 8 నుంచి 12లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. మూడు రోజుల్లో పత్తి రైతులకు నగదును జమ చేస్తారన్నారు. పత్తిమిల్లు యాజమాన్యం రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ భట్టునాయక్, పీఏసీఎస్ ఛైర్మన్ రాముగౌడ్, తొర్రూరు మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్‌రాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై కానిస్టేబుల్ లైంగిక దాడి

బయ్యారం పీఎస్‌లో కేసు నమోదు

బయ్యారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన ఓ వివాహితపై కానిస్టేబుల్ లైంగిక దాడి చేశాడని, దీంతో అతడిపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ దినేష్‌కు డ్యూటీ సందర్భంగా మండలానికి చెందిన ఓ వివాహిత మహిళతో పరిచయం ఏర్పడింది. 'నిన్ను నేను మంచిగా చూసుకుంటా' అంటూ ఆమెను అతడు శారీరకంగా లోబర్చుకున్నాడు. అనంతరం వారి ఇరువురి నడుమ వాట్సప్‌లో చాటింగ్, సంభాషణలు జరిగాయి. ఈ విషయాన్ని గమనించిన ఆ మహిళ భర్త ఆమెను నిలదీశాడు. దీంతో దంపతుల నడుమ గొడవ నెలకొనగా.. బాధిత మహిళ ఈ విషయాన్ని కానిస్టేబుల్ దినేష్ దృష్టికి తీసుకెళ్లింది. 'మన విషయం నా భర్తకు తెలిసింది. నన్ను విడిచిపెడుతానంటున్నాడు.. మనమిద్దం పెళ్లి చేసుకుందాం' అని అడగగా కానిస్టేబుల్ తిరస్కరించాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధిత మహిళ న్యాయం కోసం ఆదివారం బయ్యారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. తనను నమ్మించి మోసం చేసి శారీరంగా లోబర్చుకున్న కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. కానిస్టేబుల్‌పై లైంగికదాడి, చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి వెల్లడించారు.

ఆలయాలను అలంకరించాలి

- కార్తీక దీపోత్సవాలను వైభవంగా నిర్వహించాలి
- అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం
- ఈవోలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించాలని, ప్రతీ దేవాలయాన్ని దీపాలతో అలంకరించాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. నవంబరు 19 వరకు దీపోత్సవాన్ని నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈవోలు, డిప్యూటీ కమిషనర్లు, సహాయ కమిషనర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. కార్తీక మాసం హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదని, ఈ మాసంలో దీపాలను వెలిగించడం చాలా శుభప్రదమని అన్నారు. అందరు కలిసి దేవాలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి భక్తి భావంతో పూజలు చే యాలని అన్నారు. గత సంవత్సరం నిర్వహించినట్లుగా ఈసారి కూడా సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ చేసే ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. ప్రతీ రోజు దేవాలయాల్లో సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు మట్టి ప్రమిద లు, వొత్తులు, నూనెతోపాటుగా పసుపు, కుంకు మ, తాంబూలాలను అందజేయాలన్నారు. కార్తీక సోమవారం రోజు సామూహిక దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు పైన పేర్కొన్న వస్తువులతోపాటు కుంకుమ, పసుపు, ఆకులు, వక్కలు ఏ దైనా పండు ఇవ్వాలన్నారు. అనంతరం దీపాలు వదలడానికి తాత్కాలిక వాటర్ పాండ్స్ ఏర్పాటు చేయాలన్నారు. నది పరివాహక ప్రాంతాల్లోని దేవాలయాల్లో నది హారతి నిర్వహించాలన్నారు. ఈ సంవత్సరం సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా భక్తుల కోసం బ్రహ్మశ్రీ నాగఫణి శర్మ, సామవేదం షణ్ముఖ శర్మలచే ప్రముఖ దేవాలయాల్లో ప్రవచనాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు ఏ ఆలయానికి వస్తారో అక్కడ స్థానికంగా రెవెన్యూ, పోలీసు, ట్రాఫిక్ విభాగాల సహాయంతో చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల సేవలు వినియోగించుకోవాలని, ప్రతీ దేవాలయంలో లైటింగ్ పక్కాగా ఉండాలని అన్నారు. భజన మండలి, సంప్రదాయ నాట్య మండలి సంఘాలను ఉపయోగించుకోవాలని, టూరిజం డిపార్ట్‌మెంట్ సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా చేపట్టాలని అన్నారు. ఈ ఉత్సవాల్లో ఏదో ఒక రోజు జిల్లా కలెక్టర్లు కూడా పాల్గొనే విధంగా చూడాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.

తాళ్లపూసపల్లిలో చోరీ

5.6 తులాల బంగారం, 17 తులాల వెండి అపహరణ



రోదిస్తున్న బాధితురాలు ఆమె కుమార్తె

కేసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపూసపల్లిలో పాతురి అనసూర్య ఇంట్లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి చొరబడి బంగారం, వెండి అపహరించినట్లు ఎస్ఐ క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన ప్రకారం. అనసూర్యకు కూతురు ఉండగా ఆమె వివాహం చేసింది. కూలీ పని చేసుకునే ఆమె భర్త వెంకన్న గతంలో మృతి చెందగా, అనసూర్య ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో గ్రామంలోని తన బంధువు ఇంట్లో శనివారం రాత్రి నిద్రించేందుకు వెళ్లింది. అంతకు ముందు సుమారు రూ.6లక్షలపైగా విలువైన తన 5.6 తులాల పుస్తెలతాడు, చంద్రహారం, 17 తులాల వెండి పట్టీలను ఒక డబ్బాలో పెట్టి ఇంటికి తాళం వేసి ఆ తాళం చెవిని ఇంటి ముందు ఉండే గూటిలో పెట్టింది. రాత్రి గుర్తుతెలియని వ్యక్తి తాళం తీసి కేవలం బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లి మళ్లీ యథావిధిగా తాళం వేసి గూటిలో పెట్టి వెళ్లిపోయాడు. ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహబూబాబాద్ నుంచి క్లూస్ టీంను రప్పించి పోలీసులు ఆధారాలను సేకరించారు. గూటిలో అందుబాటులో ఉన్న తాళం తీసి నేరుగా ఆభరణాలను ఎత్తుకెళ్లిన తీరును పరిశీలిస్తే తెలిసిన వారి పనే అని పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.



బాధితురాలు అనసూర్య ఇల్లు ఇదే

కుక్కల స్వైరవిహారం

- ముగ్గురికి తీవ్ర గాయాలు.. జిల్లా ఆస్పత్రికి తరలింపు
- గోపాల్‌రావునగర్ కాలనీలో ఘటన

8

ఏజెన్సీలో యథేచ్ఛగా పేకాట దందా

- జూదరుల వ్యసనమే నిర్వాహకుల ఆర్థిక వనరు
- శిబిరాలను ఏర్పాటు చేసి అందినంత దోపిడీ
- పోలీసులు దాడులు చేస్తున్నా మారని తీరు

కొత్తగూడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలం కొత్తగూడలో 'పేకాట' జోరుగా సాగుతోంది. మూడు జాకీలు ఆరు కింగ్‌లుగా యధేచ్ఛగా కొనసాగుతోంది. జూదరుల వ్యసనమే ఆర్థిక వనరుగా భావించిన నిర్వాహకులు.. అమాయకులను దోచుకుంటూ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. గత 7నెలల్లో 2సార్లు పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు చేసి పేకాట రాయుళ్లను పట్టుకున్నా.. నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పేకాట స్థావరం నిర్వహించే వ్యక్తి పేకాట వ్యసనపరులను గుర్తించి తాను ఏర్పాటుచేసిన పేకాట శిబిరం వద్దకు తీసుకువచ్చి పేకాట ఆడిస్తుంటాడు. వారికి కావాల్సిన 'అన్ని' సౌకర్యాలను సమకూరుస్తున్నాడు. ఆటకు కొంత మొత్తం తీసుకుని ఆటలు ఆడిస్తున్నాడు. అతడి అక్రమ సంపాదన కోసం అమాయకులను పేకాటకు ఉసికొల్పి వారి జీవితాలను బలితీస్తున్నాడు. కాగా, ఈ యేడు మార్చి 24న పక్కా సమాచారంతో అప్పటి ఎస్సై కుశకుమార్ కొత్తగూడ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు చేశాడు. పేకాట ఆడుతున్నవారిని అదుపులోకి తీసుకుని, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి కోర్టుకు అప్పగించారు. దీంతో కొంత కాలం పేకాటకు దూరంగా ఉన్నాడు. డబ్బుకు మరిగిన ఆ నిర్వాహకుడు శిబిరాన్ని మార్చి పేకాట దందాకు మళ్లీ తెరలేపారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఎస్సై రాజ్‌కుమార్ పక్కా సమాచారంతో కొత్తగూడలోని గాంధీనగర్‌లో పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి ఎడుగురిని అదుపులోకి తీసుకుని, రూ.17వేల నగదు, 6సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, 6నెలల్లోనే రెండు సార్లు పోలీసులు పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేయడం మండలంలో చర్చనీయాంశమైంది.



బలవుతున్న అమాయకులు

కొందరి ఆర్థిక స్వార్థం కోసం ప్రలోభాలకు లొంగి పేకాట ఆడుతూ పోలీసుల దాడుల్లో పట్టుబడిన వారు పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఖర్చులు భరిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఫలితంగా వారి కుటుంబాల్లో గొడవలకు దారులు తీస్తున్నాయి. మనోవేదనకు గురవుతున్నారు. కొత్తగూడ మండలకేంద్రంలో పేకాట స్థావరాలు మారుతున్నాయి. కానీ ముగింపు కావటంలేదని పలువురు చర్చించుకుంటున్నారు.



పేకాట శిబిరాలు నిర్వహిస్తే జైలుకే..

ఎస్సై రాజ్‌కుమార్

పేకాట, జూదం శిబిరాలు నిర్వహిస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తాం. పేకాట అడేవారిపై సస్పెక్ట్‌షీట్స్ ఓపెన్ చేస్తాం. పేకాట, జూదాలు ఆడుతూ ఆర్థికంగా నష్టపోవద్దు, కుటుంబాలకు దూరం కావద్దు.

జాతీయ స్థాయి కరాటేలో ప్రతిభ



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

జనగామ కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కరాటేలో జనగామ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 25న జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 17వ నేషనల్ మాన్సూన్ క్యాంపు గోవాలోని కంపాల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ క్యాంపులో జనగామ జిల్లాకు చెందిన మాస్టర్ పులిగిల్ల సుకేష్ ఆధ్వర్యంలో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా మాస్టర్ సుకేష్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులు తమ శిక్షణలో తర్ఫీదు పొందారని, తొలిసారిగా జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఇంట్లో దగ్ధమైన వస్తువులను చూపుతున్న మణెమ్మ

తరిగొప్పుల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాలయం వీధిలో షార్ట్‌సర్క్యూట్‌తో శనివారం అర్ధరాత్రి నిత్యావసర సరుకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితురాలు నారోజు మణెమ్మ కథనం ప్రకారం... మణెమ్మకు ముగ్గురు కుమారులు ఉండగా వివాహాలు చేసుకుని బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆరేళ్ల క్రితం ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందగా ఇంట్లో ఒక్కతే ఉంటోంది. శనివారం రాత్రి మణెమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి వర్షం కురువడంతో ఇంట్లో ఉన్న కరెంట్ వైర్లు పాతవి కావడంతో వర్షానికి తడిసి ప్రమాదం వాటిల్లింది. ప్రమాదంలో నిత్యావసర వస్తువులు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. తనను ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంటుంది.

70 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాతలకు మెమొంటోలు అందిస్తున్న నిర్వాహకులు

జనగామ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రక్తదాన శిబిరంలో 70 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసియా ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జనగామలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 70 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు మొయినొద్దీన్ తెలిపారు. అనంతరం రక్తదాతలకు మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుగుణాకర్ రాజు, కార్తీక్, ఈశ్వర్, శివ, తౌఫిర్ షాహిద్, మొసిన్, శ్రుతి, మహేష్ పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా 'ఆయుష్మాన్'

- పేద వారికి అందని వైద్యం
- రూ.5 లక్షల ట్రీట్‌మెంట్ కలేనా..?
- లబ్ధి చేకూర్చని పథకం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు ఆస్పత్రులే..



భూపాలపల్లి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం నిరుపేదలకు అందని ద్రాక్షలా మారింది. ఇది చెప్పుకోవడానికే తప్ప లబ్ధి పొందేందుకు కాదన్నట్టు ఉంది. ఈ పథకం 2018లో ప్రవేశపెట్టగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వారు లక్షల్లో సంబంధిత కార్డులు పొంది ఉన్నారు. కానీ, కార్డు ఉందని చూపించుకోవడం తప్ప దాంతో ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది.

రాష్ట్ర వ్యాప్తంగా 12 ఆస్పత్రులను ఆయుష్మాన్ భారత్ పథకంకోసం ఎంపిక చేశారు. వాటిలో వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు ఆస్పత్రులకు మాత్రమే అవకాశం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు ఆస్పత్రులు కూడా కూడా సర్కారువే. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందుతుందని భావించిన లబ్ధిదారులకు నిరాశే మిగిలింది.

1,350 రోగాలకు ట్రీట్‌మెంట్ కలేనా?

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 1,350 రోగాలకు వైద్యం అందించొచ్చని 2018లోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ వైద్యం అందడం లేదని తెలుస్తోంది. ఇందులో బాలికలకు, మహిళలకు, వృద్ధులకు, అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు కూడా నిబంధనలు పెట్టారు. కానీ, అవేవీ ఇప్పుడు కనిపించడం లేదు. ఈ ట్రీట్‌మెంట్ ద్వారా దేశంలో ఎక్కడైనా వైద్యం పొందొచ్చని నిబంధనలు ఉన్నప్పటికీ అది అందని ద్రాక్షలా మారిందే వాదనలు వినిపిస్తున్నాయి.

కార్డు ఉన్నా ప్రయోజనం శూన్యం

ఈ పథకాన్ని 2018 సెప్టెంబరు 23న ప్రారంభించారు. దీని ద్వారా ఆస్పత్రుల్లో చేరడానికి అవసరమైన వైద్య ఖర్చులు, చికిత్స, మందులు, పరీక్షలు ఉచితంగా అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ స్కీంలో తమ పేరును నమోదు చేసుకున్నారు. పేద, బలహీన వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికి ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకం ఇది. పైగా దీనిని ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకంగా పరిగణించారు. ఇది పూర్తిగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల కోసం ప్రవేశపెట్టింది. అర్హులైన వారంతా ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ కార్డు పొంది ఉన్నారు. ఈ పథకం లబ్ధి పొందడానికి దేశవ్యాప్తంగా 50 కోట్ల మంది వేచివున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులకే పరిమితం

ఆయుష్మాన్ భారత్ కార్డు ప్రభుత్వ ఆస్పత్రులకు మాత్రమే పరిమితమైందనే వాదనలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు ఆస్పత్రుల్లో మాత్రమే ఉండగా వాటిలో వైద్యం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో పలు ఆస్పత్రులు ఉన్నప్పటికీ అందులో ట్రీట్‌మెంట్ అందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో అర్హులైన నిరుపేద ప్రజలు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. దీంతో చేసేదేమీ లేక ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. ఈపథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తున్నామని చెబుతున్నపటికీ అలాంటిదేమీ పొందలేక పోతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తండ్రి మందలించాడని..

- పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

వాజేడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడనే మనస్తాపంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పేరూరుకు చెందిన తొట్ల గణేష్(24) కొంతకాలంగా ఎవరితో మాట్లాడకుండా ఏం పని చేయకుండా ఉంటున్నాడు. దీంతో తండ్రి ఐలయ్య మందలించాడు. మనస్తాపానికి గురైన గణేష్ శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో గడ్డి మందు తాగాడు. నోట్లో నుంచి నురగలు వస్తుండటంతో గమనించి కుటుంబ సభ్యులు ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తున్న క్రమంలో శనివారంరాత్రి మృతి చెందాడు. ఐలయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి వివాహాలు జరిపించాడు. కొడుకు గణేష్ గతంలో కూడా ఒకసారి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బతికించుకున్నారు. రెండోసారి ఆత్మహత్యకు పాల్పడగా వైద్యం అందించినా ప్రాణాలు దక్కలేదు.

మల్లూరు హేమాచలానికి
పోటెత్తిన భక్తులు



మంగపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహ స్వామిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మల్లూరు క్షేత్రానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రాజశేఖర్‌శర్మ, పవన్ కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ఆలయ స్థల పురాణాన్ని, విశేషాలను వివరించారు.



మల్లూరు హేమాచల ఆలయానికి తరలివచ్చిన భక్తులు

తాటికొండలో ఎలుగుబంట్ల సంచారం



స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తాటికొండ గ్రామంలో రాత్రి వేళల్లో రోడ్లపై ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో గ్రామస్థులు జంకుతున్నారు. తాటికొండకు చెందిన ఇద్దరు యువకులు శనివారం రాత్రి గ్రామ పరిధిలోని జీబీతండా (గిద్దె బండ తండా) నుంచి తాటికొండ వైపు బైక్‌పై వస్తున్న క్రమంలో రోడ్డుపై రెండు ఎలుగుబంట్లు తారసపడ్డాయి. యువకులు బైక్‌ను బాగా రేస్ చేసి శబ్దం చేయడంతో చెట్ల పొదల్లోకి పారిపోయాయి. శివారులోని మట్టి ఏనెలను తొలగించడం వల్లనే ఎలుగుబంట్లు రోడ్లపై సంచరిస్తున్నాయని, ఏనెల తొలగింపును సంబంధిత అధికారులు స్పందించి అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన

మహాముత్తారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడుదామని, గంజాయిని నిర్మూలించి యువత భవిష్యత్ కాపాడుదామని కాంక్షిస్తూ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం పెగడపల్లిలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 2కే రన్ చేపట్టారు. జాతీయ యోగా మాస్టర్ వావిల్ల కిష్టయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాటోత్ రాజారాం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంశీరాజ్, గ్రామస్థులు రామగిరి రాజయ్య, లచ్చిరాం, శ్రీరామ్‌నాయక్, రామగిరి రాజు, వావిల్ల రవీందర్, అర్జున్, శ్రీనివాస్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



పెగడపల్లిలో యువకులతో నిర్వహిస్తున్న 2కే రన్

రామప్ప ఆలయంలో సందడి





రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు, పర్యాటకులు, గైడ్ ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న ఫ్రాన్స్ దేశస్థులు

వెంకటాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో ఆదివారం సందడి నెలకొంది. వారాంత సెలవు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో దేవాలయాన్ని సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకులు ఉమాశంకర్, హరీశ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. శిల్పకళా సంపదను వీక్షించిన పర్యాటకులు ఆలయ విశిష్టత, చరిత్ర గురించి గైడ్‌ను అడిగి తెలుసుకుని ఆనందంతో పరవశించి పోయారు. అనంతరం ఆలయ గార్డెన్‌లో కొద్దిసేపు సేద తీరారు. సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. అలాగే రామప్ప దేవాలయాన్ని ఫ్రాన్స్ దేశస్థులు సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న వారు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయండి

వెంకటాపూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 1న జరిగే చలో హైదరాబాద్ ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని ములుగు ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యామ్ కోరారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల నాయకులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్.గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మారెపల్లి రాజు, చొప్పదండి కిరణ్, చంటి సతీష్, మారెపల్లి మాస్, కుమార్, నర్సయ్య, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఎన్నిక



సుధాకర్, గణపతిరెడ్డి

గార్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న గ్రామ పంచాయతీ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కమిటీ 5వ మహాసభలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాలడుగు భాస్కర్, అధ్యక్షుడిగా పైళ్ల గణపతిరెడ్డితోపాటు మరో 54 మందితో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హామీలు నెరవేర్చకపోతే మంత్రుల ఇళ్లు ముట్టడిస్తాం

- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని కేజీకేఎస్ (కల్లు గీత కార్మిక సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని గీత కార్మికుల భవనంలో జిల్లా నాయకుడు గట్టు రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాలుగేళ్లుగా గీత కార్మికులకు కొత్త పెన్షన్లు ఇవ్వకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త పెన్షన్‌లను అందించాలని డిమాండ్ చేశారు. ప్రతీ జిల్లా కేంద్రంలో తాటి, ఈత ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. తాటిచెట్టు ఎక్కే కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కిట్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రెండేళ్ల పాలనలో కేవలం 20వేల కార్మికులకు మాత్రమే అందించిందన్నారు. మద్యం షాపు టెండర్లలో గీత కార్మికులకు 25 శాతం మేర అందించాలని, ప్రతీ గ్రామంలో తాటి, ఈత వనాలను పెంచుకోవడానికి గాను ఐదెకరాలు గీత సొసైటీలకు అందించాలన్నారు. వచ్చే నెల 10న జనగామలో జరిగే జిల్లా మహాసభలను, వచ్చే నెల 28న సూర్యాపేటలో జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, గట్టు రమేష్‌గౌడ్, కనకటి రాజయ్య, నాగన్న, భాస్కర్, పులి శ్రీనివాస్, గట్టు ఉప్పలయ్య, ఇల్లెందుల రాజు, గట్టు శ్రీనివాస్, గట్టు రాజయ్య, ఉమాపతి, అశోక్, బలరాములు పాల్గొన్నారు.

జామాయిల్ మొక్కల అపహరణ

డోర్నకల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం బూరుగుపాడుకు చెందిన బజ్జూరి వెంకట్‌రెడ్డి అనే రైతు సాగు చేసిన జామాయిల్ మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం తోట వద్దకు వెళ్లిన వెంకట్‌రెడ్డి దంపతులకు మొక్కలు కనిపించలేదు. దీంతో బాధితులు లబోదిబోమన్నారు. ఈ ఏడాది జూన్‌లోనే 400లకు పైగా మొక్కలు నాటినట్లు వెంకట్‌రెడ్డి తెలిపారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

బయ్యారం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నట్లు ఏవో రాజు తెలిపారు. బయ్యారంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రాయితీ పొందే రైతులు ఈ నెల 29 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో చేతిపంపులు 144, పవర్ స్ప్రెయిర్స్ 26, రోటవేటర్స్ 10, సీడ్ కామ్ ఫర్టిలైజర్ 2, ట్రాక్టర్ పనిముట్లు 13, బండ్ ఫార్మర్ 1, పవర్ వెడర్ 1, బ్రెష్ కట్టర్ 2, పవర్ టిల్లర్ 1, స్ట్రాబెలర్ 2 యూనిట్లు రాయితీపై అందుబాటులో ఉన్నట్లు ఏవో వెల్లడించారు. కాగా, ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, మిగిలిన రైతులకు 40 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు సంబంధిత పత్రాలతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

అధికారులు సేకరించిన స్థలంలో ఆస్పత్రి నిర్మించాలి




జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

కొత్తగూడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడలో అధికారులు సేకరించిన స్థలంలోనే 30 పడకల ఆస్పత్రి నిర్మించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గూడూరులో ఆదివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ఎంపీడీవో కార్యాలయం ముందు అటవీశాఖ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి మూడెకరాల స్థలం కేటాయించారని పేర్కొన్నారు. అధికారులు గుర్తించిన స్థలంలోనే ఆస్పత్రి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని హుస్సేన్ నాయక్‌కు వినతి పత్రం అందజేశామని పేర్కొన్నారు. స్పందించిన హుస్సేన్ నాయక్ ఆస్పత్రి నిర్మాణంపై ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు భూపతి తిరుపతి, యాదగిరి మురళి, హరిలాల్ నాయక్, తోటకూరి మధు, గుగులోత్ స్వామినాయక్, మాలోత్ సంతోష్, జిమ్మిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

కురవి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు రాజకీయంగా రాణించాలని సంఘం మండల అధ్యక్షుడు చకినాల భద్రయ్య అన్నారు. కురవిలోని ఓం ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, నిరుపేదలకు సహాయం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ వెంకటరామారావు, ప్రధాన కార్యదర్శి వేమిశెట్టి ప్రసాద్, కోశాధికారి కలకోట నారాయణరావు, కర్నాటి మోహన్‌రావు, వాసు, సోమన్న, వేమిశెట్టి సంతోష్, సముద్రాల ప్రకాష్, శ్రీరాం వెంకన్న, ఓమ సీతయ్య పాల్గొన్నారు.



బినామీ హాజరుకు చెక్

- ఈ-కేవైసీ నమోదైతేనే ఉపాధి
- రెండుసార్లు ఫొటో తీస్తేనే కూలీల అకౌంట్లలో డబ్బు జమ
- అక్రమంగా హాజరు వేసే ఫీల్డ్ అసిస్టెంట్ల ఆగడాలకు బ్రేక్
- ఈ-కేవైసీ నమోదులో రాష్ట్రంలోనే హనుమకొండ జిల్లా టాప్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులలో నిబంధనలు ఎప్పటికప్పుడు మారుస్తున్నప్పటికీ ఫీల్డ్ అసిస్టెట్ల అవకతవకలకు అడ్డుకట్ట పడటం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాల నివారణకు పనుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేసేలా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కూలీల జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేశారు. అయితే కొందరు కూలీలు పనులకు రాకున్నా ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు వేస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలతో ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ కేవైసీ) ప్రక్రియ ప్రారంభించారు.

హనుమకొండ జిల్లాలో 2006 నుంచి నమోదైన కూలీలు మొత్తం 1,66,458 మంది ఉండగా, ఇందులో యాక్టివ్ కూలీలు 96,113 మంది ఉన్నారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉండి 3 ఏళ్లలో ఏ ఒక్క రోజు పనిచేసినా కూడా వారిని యాక్టివ్ కూలీలుగా పరిగణిస్తారు. జిల్లాలో ఉన్న 96,113 మంది యాక్టివ్ కూలీలలో ఇప్పటికే(90.23శాతం) జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో 86,688మంది కూలీల ఈకేవైసీ పూర్తయింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ ప్రక్రియ గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. జిల్లాలోని 12 మండలాల్లో ఉన్న 96,113 మంది యాక్టివ్ కూలీలలో ఆధార్ నమోదు చేసుకున్న కూలీలు 96,077 ఉండగా ఈ కేవైసీ 86చ688మంది కూలీలకు పూర్తి అయింది.

ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలకు చెక్

గతంలో జిల్లాలోని ఆత్మకూరు, ధర్మసాగర్, హసన్‌పర్తి, దామెర మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఆ ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోకుండా తమ సామాజికవర్గానికి చెందిన అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయా మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. చాలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు దగ్గర అనుకున్న కూలీలు పనికి రాకున్నా హాజరు వేస్తూ వారి మెప్పు పొందుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేవారు. ప్రస్తుతం ప్రభుత్వం కూలీల ఫొటోలు రోజుకు రెండుసార్లు తీసే పద్ధతి తీసుకురావడంతో ఇక ఫీల్డ్ అసిస్టెంట్ల ఆటలు చెల్లవని పలువురు అంటున్నారు. కూలీ ఉదయం వచ్చినప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్ ఫొటో తీసుకోవాలి. మళ్లీ పని అయిపోయి వెళ్లేటప్పుడు మళ్లీ ఫొటో తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం నూతనంగా ఈకేవైసీ పద్ధతి తీసుకురావడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్ట పడుతుంది.

రెండుసార్లు ఫొటో తీస్తేనే హాజరు

ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న క్రియాశీల కూలీల ఈకేవైసీని ఫీల్డ్‌అసిస్టెంట్లు మొబైల్‌లోని ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తారు. కూలీలు ఈ ప్రక్రియ నమోదు చేసుకుంటేనే వారి అకౌంట్లలో డబ్బు పడుతుంది. రెండుసార్లు ఫొటో తీసినా సరిగ్గా నమోదు అయితేనే కూలీల హాజరు పడుతుంది. ఈకేవైసీలో భాగంగా యాప్‌లో మొదటగా నమోదైన ఫొటో కూలీ పనికి వస్తేనే ఆన్‌లైన్‌లో హాజరు పడుతుంది. ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశం నుంచే పనుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తుండటంతో అవకతవకలు తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.



ఈ-కేవైసీ ప్రక్రియ ముమ్మరం చేశాం..

మేన శ్రీను, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

హనుమకొండ జిల్లాలోని 12 మండలాల్లో ఉన్న అన్ని గ్రామాల్లో ఈకేవైసీ ప్రక్రియ ముమ్మరం చేశాం. జిల్లాలో ఇప్పటికే 90.23శాతం పూర్తయింది. త్వరలోనే 100శాతం కూలీలు ఈ కేవైసీ చేసుకుంటారు. ఈకేవైసీ ప్రక్రియ ద్వారా ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరగకుండా ఉంటాయి. రాష్ట్రంలోనే ఈ కేవైసీ నమోదులో మన జిల్లా మొదటిస్థానంలో నిలిచింది.

హనుమకొండ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్

ఈ కేవైసీలో హనుమకొండ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని ప్రభుత్వం ఈ యేడు సెప్టెంబర్‌లో అన్ని మండలాల్లో ఈ కేవైసీ ప్రక్రియ ప్రారంభించింది. ఆ తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రారంభించారు. ఈ కేవైసీ ప్రక్రియలో రాష్ట్రంలోనే జిల్లా 90.23శాతంతో మొదటిస్థానంలో నిలిచింది. జిల్లాలోని 12మండలాల్లో ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతుండగా దామెర మండలం ఈకేవైసీ నమోదులో 98.66శాతంతో మొదటిస్థానంలో నిలిచింది. తర్వాత ఎల్కతుర్తి 98.21శాతం, ఆత్మకూరు 93.55శాతం, నడికూడ 93.09శాతం, పరకాల 91.47శాతం, భీమదేవరపల్లి 90.15శాతం, ధర్మ సాగర్ 89.25శాతం, శాయంపేట 88.81శాతం, ఐనవోలు 86.76శాతం, హసన్‌పర్తి 86.00శాతం, వేలేరు 85.60శాతం, కమలాపూర్ మండలంలో 85.49శాతం ఈకేవైసీ పూర్తయింది.





పర్వతగిరిలో ఏర్పాటు చేసిన గోశాల

గోమాత రక్షతి రక్షితః..!

- భారంగా గోశాల నిర్వహణ
- దాతలు ముందుకు రావాలంటూ పిలుపు
- పర్వతగిరిలో ఆదర్శంగా గోశాల నిర్వాహకుడు

పర్వతగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోవులు గ్రామాల్లో రక్షించబడితే వాటి ద్వారా మనం రక్షించబడతామనేది పెద్దల మాట. గ్రామాల్లో ప్రతి వ్యవసాయ దారుడి ఇంట్లో గోవులు ఉండేవి. వాటి ద్వారా లభించే పాలను తాగడం ద్వారా కుటుంబసభ్యులు ఆరోగ్యంగా ఉండేవారు. పశువుల పేడతో రైతులు పండించే వ్యవసాయ పొలాల్లో చల్లడం సేంద్రియ సాగు ద్వారా భూమి సురక్షితంగా ఉండేది. కానీ నేడు పశువుల పోషణ కరువైంది. వాటిని రక్షించేవారు లేక సేంద్రియ సాగు పద్ధతులను మరిచి రసాయనికి పురుగుల మందులకు రైతులు అలవాటు పడ్డారు. కానీ గోవులను రక్షిస్తూ వాటి ప్రాముఖ్యను చూపుతూ ఓ వ్యక్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఎనిమిదేండ్లు నిర్వహణ

వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన వేణుగోపాల స్వామి గుడి అర్చకుడు మోపర్తి ఫణిశర్మ ఎనిమిదేండ్ల కిందట గోశాల నిర్వహణకు ముందుకు వచ్చారు. దీంతో దుబ్బ నారాయణ ఇంటి స్థలాన్ని అడగ్గా ఉచితంగా అందించాడు. ఇతర క్షేత్రాల నుంచి గోవులను తీసుకువచ్చి వాటిని సురక్షితంగా చూసుకుంటూ 40 ఆవుల వరకు పెంచాడు. ఇటీవల కాలంలో గోమాతలను పెంచుకునే వారికి ఉచితంగా 18 ఆవులను పంపిణీ చేశాడు.

భారంగా నిర్వహణ

గోవుల ఆలనా పాలనా చూసుకోవడం కోసం ఇద్దరు వ్యక్తులను నియమించాడు. వారికి జీత భత్యాలు నెలకు రూ.20వేల వరకు అవుతుండగా, పశుగ్రాసం, ఇతర నిర్వహణ ఖర్చులు ఫణిశర్మ తన సొంతంగానే ఖర్చు చేస్తున్నాడు. దాతల సహకారం అంతలా లేకపోవడం ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెపుతున్నాడు. పశువుల మేత కోసం కొంత మంది దాతలు సహకరిస్తున్నట్లు ఇతర వాటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపాడు. గో సంరక్షణ కోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని, గోవులను కాపాడితే మనల్ని కాపాడుతాయని పిలుపునిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

రైతులు కలేబరాలను తరలించొద్దు...



రైతులు పశుపోషణ భారమై కలేబరాలను గోవులను అమ్మవద్దు. తన గోశాలకు అప్పగించాలి. గోశాలలో ఉన్న ఆవులను గో ప్రేమికులు ఒక్కో గోమాతకు దత్తత తీసుకోవాలి. తద్వారా తనతో పాటు గోమాతకు సేవ చేసిన వారవుతారు.

- ఫణిశర్మ, గోశాల నిర్వాహకుడు

సాంకేతిక అరణ్యం

- అడవిని తలపిస్తున్న నిట్ క్యాంపస్
- దట్టంగా పెరిగిన చెట్లు.. చుట్టూ పరుచుకున్న పచ్చదనం

వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల (నిట్) క్యాంపస్‌లో పర్యావరణం తొణికిసలాడుతోంది. ఎటుచూసినా ఏపుగా పెరిగిన చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం పరిఢవిల్లుతోంది. 250 ఎకరాల్లో విస్తరించిన నిట్‌ను పైనుంచి చూస్తే అడవి మధ్యలో ఉన్నట్టు కనిపిస్తోంది. వేలాది చెట్ల మధ్య బహుళ అంతస్తుల భవనాలు, వందకుపైగా ప్రయోగశాలలు, 50కిపైగా విభాగాలు, విద్యార్థుల హాస్టల్ భవనాలు, భోజనశాలలు, అందంగా కనిపించే పరిపాలనా భవనం, విశాలమైన ఆడిటోరియం, ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియం వంటి పలు భవనాల నిర్మాణం జరిగినా పచ్చదనానికి మాత్రం కొదవలేదు. దట్టంగా పరుచుకున్న పచ్చిక బయళ్లు, క్యాంపస్ అంతా ఎత్తైన అనేక చెట్లు నగరం మధ్యలో వెలిసిన దట్టమైన అడవిని తలపింప చేస్తోంది.

ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్/హనుమకొండ



దట్టంగా పెరిగిన చెట్ల మధ్య వరంగల్ నిట్ కళాశాల

కోచ్‌ఫ్యాక్టరీ పనులు పూర్తయ్యేనా..?

- డిసెంబరు గడువు దాటే అవకాశం
- నేడు పనులను పరిశీలించనున్న ఎంపీ కావ్య
- రైల్వే ఉన్నతాధికారులతో సమీక్ష



అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న కోచ్‌ఫ్యాక్టరీ

కాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సమీపంలోని అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అనుకున్న షెడ్యూల్ ప్రకారం డిసెంబర్‌లో పూర్తి అయ్యేట్టు లేదు. పనులు పూర్తికావడానికి మరో మూడు నెలలు సమయం పట్టొచ్చని రైల్వే అధికారులు అంచనావేస్తున్నారు. 160ఎకరాల్లో సుమారు రూ.786 కోట్లతో 2023 జూలై 8న ప్రధాని మోదీ కోచ్‌ఫ్యాక్టరీ పనులను ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో వర్చువల్‌గా ప్రారంభించారు. డిసెంబరు 2025 నాటికి కోచ్‌ఫ్యాక్టరీ ప్రారంభించి కోచ్‌ల ఉత్పత్తికి ప్రణాళికలు చేసినప్పటికీ కోచ్‌ఫ్యాక్టరీ పలుమార్లు అప్‌గ్రేడ్ చేశారు. ఓవరాలింగ్ షెడ్ తోపాటు కోచ్‌ల తయారీ మాత్రమే కాకుండా ఎలక్ట్రికల్ ఇంజన్‌లు, వందేభారత్ కోచ్‌ల తయారీలకు కేంద్రం సిగ్నల్ ఇవ్వడంతో వాటి మిషనరీలు ఇతర దేశాలనుంచి తెప్పించడంతో పాటు ఇతరత్రా షెడ్‌ల నిర్మాణానికి మరింత సమయం పెరిగింది. దీంతో మరో మూడు నెలలు సమయం పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, ప్యాకేజీ సబ్‌స్టేషన్, రెస్ట్ హౌజ్, పవర్‌టెస్ట్, రోడ్‌వే బ్రిడ్జ్, వ్యాగన్ వే బ్రిడ్జి ట్రాక్‌లు, వ్యాగన్ వే బ్రిడ్జి, స్క్రాప్‌బిన్ లాంటి ఇతరత్రా పనులు దాదాపు 80 శాతం వరకు పూర్తయ్యాయి.. ఇంకా రైల్వే క్వార్టర్స్, మిషన్‌ల ఫిట్టింగ్, కనెక్టివిటీ రోడ్‌లు, పూర్తి కావల్సి ఉంది.

నేడు పరిశీలించనున్న ఎంపీ కావ్య

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని వరంగల్ ఎంపీ కడియం కావ్య సోమవారం సందర్శించనున్నారు. ఉదయం 10గంటలకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి కోచ్‌ఫ్యాక్టరీ చేరుకుని నిర్మాణపనులు, మిషనరీలను పరిశీలించనున్నారు. నిర్మాణ పనులు ఎక్కడి వరకు వచ్చాయి, నిర్మాణం ఆలస్యం కావడానికి గల కారణాలపై రైల్వే అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. ఆ తర్వాత అక్కడే నిర్మాణపనులు చేపడుతున్న రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) అధికారులతో కలిసి నిర్మాణ పనులపై సమీక్ష చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పరకాలలో మహారుద్రయాగం

- నవంబరు 3న నిర్వహణ
- శ్రీ భవాని కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాట్లు
- 108 హోమగుండాలతో 500 జంటలతో పూజలు
- రూ.40 లక్షల వ్యయంతో యాగం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

పరకాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సుఖసంతోషాలతో, రైతులు సాగు చేస్తున్న పంటల అభివృద్ధి, వ్యాపారుల అభివృద్ధే ధ్యేయంగా పరకాల నియోజకవర్గ కేంద్రంలోని శ్రీభవాని కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో నవంబరు 3న అతిపెద్ద మహా రుద్ర యాగ మహోత్సవం నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా భూ పరీక్ష, సర్వనంది తీర్థం, సంగ్రహణ, సమీక్ష, అంకురార్పణ, ద్విజావపన, మహారుద్ర వంటి పూజా కార్యక్రమాలను 20 రోజులపాటు దేవస్థానంలో నిర్వహించి 21వ రోజున కార్తీకమాసం నవంబరు 3న సోమవారం రోజున దేవస్థానం ఆవరణలో శ్రీకళయుక్త యాగశాలను అష్టోత్తర శతస్థాయి యుక్త అష్టార శత కుండాత్మకంగా అతి వైభవంగా నిర్వహించనున్నారు.

వేద పండితులతో..

516జంటల భక్తజనంతో 108 హోమగుండాలతో నిర్వహించే యాగ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులతో 51 మంది పండితులు పాల్గొని హోమాన్ని నిర్వహించనున్నారు. 10 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమంతోపాటు బెల్లం పాయసం, ప్రసాద తీర్థాలను అందించనున్నారు. పరకాల పట్టణంతోపాటుగా భూపాలపల్లి,కరీంనగర్, హనుమకొండ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందస్తుగానే సిద్ధం చేసుకుంటున్నారు.



పరకాలలో ఏర్పాటు చేస్తున్న యాగశాల



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

40 ఏళ్ల పోరాటం సుభిక్షం

భవాని కుంకుమేశ్వరస్వామి దేవస్థానం సంబంధించిన నాలుగు ఎకరాల 11 గుంటల భూమి గత 40ఏళ్లుగా కోర్టు కేసులో ఉండేది. కొందరు పట్టణానికి చెందిన ప్రముఖులు, దేవాలయానికి సంబంధించిన భూమి కాజేసేందుకు తమ దగ్గర ఉన్న డూప్లికేట్ పత్రాలతో 4 ఎకరాల 11 గుంటల భూమి తమదేనంటూ కోర్టును ఆశ్రయించారు. దానికి సంబంధించిన కోర్టు తీర్పుతోపాటు రెవెన్యూ అధికారుల సూచనల మేరకు ఇటీవల ఆ భూమి దేవస్థానానికే చెందినదని తీర్పు రావడంతో హోమ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధం చేశారు.

మహా రుద్రయాగానికి రూ. 40 లక్షల మేరకు ఖర్చు అవుతుండటంతో హోమాన్ని నిర్వహించే భక్తజనంతోపాటు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు సహాయం అందజేశారు. నగదు రూపంతోపాటు యాగానికి కావాల్సిన అన్నదానం, సౌండ్ సిస్టం, యాగశాల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున సహకరిస్తున్నారు. నవంబరు 3న నిర్వహించే యాగానికి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

పరకాల పట్టణ కేంద్రంలోని పశువుల మైదానంలో నవంబరు 3వ తేదీన నిర్వహించనున్న కార్తీకమాస మహారుద్ర యాగ ఏర్పాట్లను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, నిర్వాహకులు, సేవా సంస్థల ప్రతినిధులతో ఏర్పాట్లను సమన్వయంతో చేయాలని సూచించారు. యాగం ఘనంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

ప్రజల సుఖశాంతుల కోసం..

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న మహారుద్ర యాగం గతంలో ఎక్కడా జరగని విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. పెద్ద ఎత్తున భక్తులు వస్తారని వారిని సంబంధించిన పూర్తి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. పరకాల నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల జిల్లాల భక్తజనం వచ్చి యాగంలో పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందాలి.

రైతులకు షాక్

- రబీ సీజన్‌కు ముందే అన్నదాతలకు ఇబ్బందులు
- పెరగనున్న ఎరువుల ధరలు
- ఉమ్మడి జిల్లాలో రైతులపై రూ. 20 కోట్ల ఆర్థిక భారం

హనుమకొండ, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల ధరలు పెరగనున్నాయి. ఇటీవల యూరియా దొరక్క ఇబ్బందులు పడ్డ అన్నదాతలకు మరో షాక్ తగలనున్నది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు మరికొన్ని కాంప్లెక్స్ ఎరువుల ఎగుమతులను ఈనెల 15 నుంచి చైనా నిలిపి వేసింది. దీనివల్ల మన దేశంలో ఎరువుల ధరలు 10 నుంచి 15 శాతం పెరిగే అవకాశం కనిపిస్తోంది.

పెరగనున్న సాగు విస్తీర్ణం

వానాకాలం సీజన్ పూర్తి అయింది. ప్రస్తుతం యాసంగి కింద రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సాధారణంకన్నా ఎక్కువ కురవడంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. భూగర్భ జలాలు పైపైనే ఉండటంతో ఆయకట్టు సాగు మరింత పెరగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వానాకాలం సీజన్ కంటే ముందుగా పెరిగిన ధరలు.. తాజాగా మళ్లీ పెరగడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. యూరియా, డీఏపీలను మినహాయించి కాంప్లెక్స్ ఎరువుల ధరలను మాత్రమే పెంచారు. యాసంగిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 18.50 లక్షల ఎకరాల్లో సాగు ఉంటుంది. ఇందుకు గాను 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయి.

కాంప్లెక్స్ వినియోగం ఎక్కువ

ఈ ఎరువుల్లో యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. తాజాగా వినియోగంలో ఎక్కువగా ఉండే కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచడం రైతులకు మరింత భారంగా మారనున్నది. ప్రస్తుతం డీఏపీ ధర ఒక సంచి రూ.1,350 ఉండగా, తాజా ఈ ధర రూ.1,350 మేరకు పెరగనున్నది. అలాగే 20:20:13 ఎరువు రూ.1,350 నుంచి రూ.1,400 వరకు, 14:35:14 ఎరువు రూ.1,850 నుంచి రూ.1,900 వరకు, 10:26:26: రూ.1,800 నుంచి రూ.1,825 వరకు 20:20:0:13 రూ.1,300నుంచి రూ.1,375, 24:24:0 రూ.1800 నుంచి రూ. 1650 వరకు పెరగనున్నది 28.28.0 ప్రస్తుత ధర రూ.1800 యథాతథంగా ఉండవచ్చు. అయితే ఈ సీజన్‌లో ఎరువుల సమస్య పెద్దగా ఉండదని, వ్యాపారులు ఇప్పటికే అంతర్జాతీయ ఏజెన్సీల ద్వారా తగినంత ఎరువుల నిల్వలను భద్రపరచారని వ్యాపారవర్గాలు తెలిపాయి. అయినప్పటికీ ధరల పెరుగుదల మాత్రం తప్పదని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో యాసంగి సాగు విస్తీర్ణం 16 లక్షల ఎకరాల వరకు ఉండవచ్చునని అంచనా.



దుక్కు దున్నుతున్న రైతు

సంచిపై రూ.50 పెరుగుదల

యాసంగిలో సాగు చేసే పంటలకు వేసే ఎరువుల ధరలు మరింత భారం కానున్నాయి. తాజాగా కొన్ని కాంప్లెక్స్ ఎరువుల ధరలు సంచికి రూ.50 పెరగనున్నాయి. మరికొన్నింటి ధరలు ఇంతకన్నా ఎక్కువ పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ప్రముఖ కంపెనీల డీలర్లకు సమాచారం అందింది. ప్రస్తుతం పాత నిల్వలు ఉండటంతో గతంలో ఉన్న ధరలకే విక్రయిస్తున్నారు. యాసంగి సీజన్‌లో రైతులు వినియోగించే ఎరువుల ధరలు పెరుగుతాయని కంపెనీలు అంటున్నాయి. ధరల పెరుగుదల వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులపై రూ. 20 కోట్ల ఆర్థిక భారం పడనున్నట్టు అంచనా.

రైతులు 9.50 లక్షలు. ఎరువుల వినియోగం 5.40లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుంది. ఎరువుల ఎగుమతులపై చైనా ఆరు నెలల వరకు నిషేధం విధించింది. ఆ తర్వాత అయినా ఈ నిషేధాన్ని ఎత్తి వేయకపోతే రైతులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొక తప్పదని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.

మన దేశం 90శాతం కాంప్లెక్స్ ఎరువులను చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నందువల్ల ఈ పరిస్థితి ఉత్పన్నం కానున్నదని చెబుతున్నారు. ఈలోగా ప్రభుత్వా ఎరువుల కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

పంటలను కొనుగోలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అన్నిరకాల పంటలకు మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ భట్టు అంజయ్య భవనంలో ఆదివారం ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న క్వింటాకు రూ.2,928, పత్తి క్వింటాకు రూ.10,075, వరి క్వింటాకు రూ.2389 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం 31న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బండారి ఐలయ్య, సక్క, లింగన్న, యాకయ్య పాల్గొన్నారు.

కందికొండ జాతరకు ఏర్పాట్లు చేయాలి

● ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్


కందికొండ పర్వతం వద్ద జాతర పనులను పర్యవేక్షిస్తున్న రాంచందర్‌నాయక్

కురవి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా కందికొండ గుట్టపై జరిగే శ్రీలక్ష్మీనర్సింహ స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ అధికారులను ఆదేశించారు. కురవి మండలం కందికొండ గుట్ట వద్ద జాతర పనులను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. కందికొండ గుట్టకు నలువైపుల జాతరకు జనం తరలి వచ్చే రహదారులను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలన్నారు. జాతరకు జనం వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉంది కాబట్టి అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. కందికొండను పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు, వచ్చే ఏడాది జాతర కల్లా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, గార్లపాటి వెంకటరెడ్డి, బండి వెంకటరెడ్డి, ప్రతాపని బిక్షమయ్య, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, గొల్లపల్లి రజినీకాంత్, నల్లపు సుధాకర్, బండి శ్రీనివాస్, హేమలత, గునిగంటి కమలాకర్, దయ్యాల శ్రీధర్, కామ సంజీవరావు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు తక్షణమే చెల్లించాలి

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్‌కు కందికొండ వద్ద వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గౌరవ అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, గుగులోతు కిషన్‌నాయక్, సోమ గోవర్ధన్ మాట్లాడారు. పదవీవిరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గత 18 నెలలుగా రిటైర్మెంట్ బకాయిలు చెల్లించలేదన్నారు. ఇప్పటివరకు కుటుంబ అవసరాలు తీరక, ఆర్థిక పరమైన ఒత్తిడితో 27 మంది ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఉద్యోగి తను దాచుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని రాంచందర్‌నాయక్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో గుదె చంద్రమౌళి, టి.మురళీధరస్వామి, యోగేశ్వరరావు, సుంకరి వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి, పద్మావతి, ఉమాదేవి, ఏసురత్నం, ఇమామ్ పాల్గొన్నారు.

రైతునేస్తం అవార్డు అందుకున్న మరియన్న


రైతునేస్తం అవార్డు అందుకుంటున్న మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ముచింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆదివారం రైతునేస్తం మాసపత్రిక, శ్రీముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ ఐవీ సుబ్బారావు రైతునేస్తం అవార్డును మహబూబాబాద్‌కు చెందిన జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్నకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అందించారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. మరియన్న ఆయిల్ పామ్ సాగు తోటల విస్తీర్ణంకు పాటుపడినందున ఈ అవార్డు దక్కింది. ఈ కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, ఎడిటర్ పద్మశ్రీ యడ్లపల్లి వేంకటేశ్వర్‌రావు, శ్రీముప్పవరపు ఫౌండేషన్ చైర్మన్ హర్షవర్దన్ పాల్గొన్నారు.

సునీల్‌కు 'భూమిరత్న' అవార్డు పురస్కారం


సునీల్‌కు భూమిరత్న అవార్డును బహూకరిస్తున్న వెంకయ్యనాయుడు

కురవి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత భూమి హక్కుల సంస్కర్త, న్యాయనిపుణులు ఎం.సునీల్‌కుమార్ (భూమి సునీల్)కు భూమిరత్న అవార్డు లభించింది. అయ్యగారిపల్లికి చెందిన భూమి సునీల్ గత 20 ఏళ్లుగా భూమి హక్కులు, గ్రామీణ ప్రాంతాల్లో న్యాయసాధికారతకు ఆయన అందించే విస్తృత సేవలకు పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం రైతునేస్తం, శ్రీముప్పవరపు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో భూమి సునీల్‌ను సత్కరించారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. సునీల్‌కు అవార్డు రావడం పట్ల కురవి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మగౌరవ ప్రదర్శనను సక్సెస్ చేయాలి

నెల్లికుదురు, అక్టోబరు 26 : సీజే గవాయ్‌పై దాడిని నిరసిస్తూ నవంబరు 1న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆత్మగౌరవ ప్రదర్శనను వియవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ తెలిపారు. నెల్లికుదురు ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు బండారి సారంగం, నలుగు అశోక్, బతిపట్ల వెంకన్న, అనసూయ, పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల సాధన సభకు తరలిరండి

● జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

మహబూబాబాద్ టౌన్, అక్టోబర్26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నవంబరు 26న జరుపతలపెట్టిన రాజ్యాంగ హక్కుల సాధన సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని జాతీయ మాల మహానాడు (జేఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట జేఎంఎం ఆధ్వర్యంలో ఆదివారం చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 99 ద్వారా మాలలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, ఆ జీవోను తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌ను 15 నుంచి 20 శాతానికి పెంచి ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిట్టిమళ్ల మహేష్, అశోద భాస్కర్, తప్పల జైపాల్, కె. వెంకటాద్రి, జంగం సిద్ధు, రాకేష్, తిరుపతి, లవకుమార్, ప్రతాప్, ప్రసాద్, రవికుమార్, అనిల్, సాత్విక్, కేశవులు, జనార్ధన్, సాయి, రంజిత్ పాల్గొన్నారు.


చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పిల్లి సుధాకర్


తాళ్లపూసపల్లిలో మాట్లాడుతున్న గొడిశాల వెంకన్న

రేషన్‌షాపుల్లో సరుకులు ఇవ్వాలి

● వ్యకా.సం. జిల్లా సహాయ కార్యదర్శి వెంకన్న

కేసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌షాపుల్లో పేదలకు 14 రకాల నిత్యావసర వస్తువులను ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గొడిశాల వెంకన్న కోరారు. తాళ్లపూసపల్లిలో ఆదివారం వ్యవసాయ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు కేవలం బియ్యం పంపిణీకే పరిమితమయ్యాయని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కనీస వేతన చట్టాన్ని సవరించి వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28 నుంచి నవంబర్ 10 వరకు సంఘం గ్రామసభలను నిర్వహిస్తున్నామని, ఈ సభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నారాయణ, మంచు విజయ, పద్మ, ఉప్పలమ్మ, రాములు, శేఖర్ పాల్గొన్నారు.

దంతాల సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దంతాల సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ప్రముఖ దంత వైద్యనిపుణుడు రాజ్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్), కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దంతవైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాలనీ వాసులకు దంతపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ దంతాల సంరక్షణ, వాటి ప్రాముఖ్యతను వివరించారు. మానవ శరీరంలో దంతాలు అతి ముఖ్యమైనవని వాటి ద్వారా ఆహారం భుజిస్తామని అందుకోసం వాటిని చక్కగా బ్రష్ చేసి ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ వీవీ. ప్రసాద్, వైస్ చైర్మన్ డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రావుల రవిచందర్‌రెడ్డి, రామసహాయం వెంకట్ రెడ్డి, కాలనీ కమిటీ అధ్యక్షుడు కట్ల వెంకన్న, కార్యదర్శి గార్లపాటి జైపాల్, బానోత్ ఖాసీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దంత వైద్య నిపుణుడు రాజ్‌కుమార్

పెద్దవంగర ఎస్సైగా క్రాంతికిరణ్ బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న క్రాంతికిరణ్

పెద్దవంగర, అక్టోబర్ 26 : (ఆంధ్రజ్యోతి): పెద్దవంగర ఎస్సైగా చిలువేరు ప్రమోద్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా పెద్దవంగర ఎస్సైగా పని చేసిన క్రాంతికిరణ్ కేసముద్రం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్‌లో ఉన్న చిలువేరు ప్రమోద్‌కుమార్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దవంగర ఎస్సైగా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడిపేతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

మానుకోట మునిసిపాలిటీకి రూ.59.62 కోట్ల నిధులు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ కార్యదర్శి శ్రీదేవి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపాలిటీకి రూ.59.62 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి టికే శ్రీదేవి ఈ నెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. మునిసిపాలిటీ పరిధిలో 56 పనులకు గాను రూ.59.62 కోట్లు నిధులను మంజూరీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) స్కీం కింద నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) భాగస్వామ్యంతో 48.62 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.11 కోట్లు వెరసీ మొత్తంగా రూ.59.62 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ నిధులను మానుకోట పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించనున్నారు. ఇప్పటికే పనులకు ప్రతిపాదనలు పంపగా అందులో ప్రజల అవసరాల రీత్యా చేర్పులు, మార్పులు చేసి అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఇది ఇలా ఉండగా మహబూబాబాద్ మునిసిపాలిటీకి పెద్ద మొత్తంలో రూ.59.62 కోట్లు మంజూరీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసిన నేపథ్యంలో స్థానిక తహసీల్ ఆఫీస్ ఎదుట సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయనున్నారు.

వాకింగ్‌తో ఆస్పత్రులకు దూరం

● వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ భారతి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు ఉదయం వాకింగ్‌తో వ్యాధులు దరిచేరకుండా, ఆస్పత్రులకు దూరంగా ఉండవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కూరాకుల భారతి అన్నారు. మహబూబాబాద్ వర్తక సంఘం భవనంలో ఆదివారం డిప్యూటీ గవర్నర్ ఇమ్మడి కృష్ణమూర్తి అధ్యక్షతన నాలుగవ క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన భారతి మాట్లాడుతూ ప్రతీ రోజు నడకతో తమ ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతీ ఒక్కరు ఉరుకుల, పరుగులతో మానసిక ఆందోళన చెందుతున్నారని అందుకోసం ప్రతీరోజు వాకింగ్ చేస్తే వాటిని అధిగమించవచ్చని చెప్పారు అనంతరం వివిధ రంగాలకు చెందిన బి.వీరన్న (వైద్యులు), వీరారెడ్డి (వాలీబాల్ కోచ్), చింతకుంట్ల కుమారస్వామి (కవి), మద్దెర్ల రమేష్ (రచయిత), వెలిశాల కుమారస్వామి(బాస్కెట్‌బాల్‌కోచ్), బానసాగమణి(సీనియర్ క్రీడాకారిణి), జ్యోత్సరెడ్డి (గైనకాలజిస్ట్), మాపురు మల్లేష్ (గాయకుడు), రాంబాబు (తైక్వాండ్ కోచ్), వీరునాయక్ (కరాటే), జి.అనితారెడ్డి (ఉపాధ్యాయురాలు)లను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్టెడ్ గవర్నర్ డాక్టర్ పుల్లూరు శ్రీనివాస్, ఉపేందర్, జోలి సత్యానారాయణ, పాలబిందెల మల్లయ్య, కోల సత్యనారాయణ, మాలె కాశీనాథ్, ఉప్పల శ్రీనివాస్, వెంకన్న, నామిరెడ్డి వెంకటరెడ్డి, రామలింగారెడ్డి, పర్కాల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీవో సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్



మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పాలన అధికారుల (జీపీవో) సంఘం జిల్లా అధ్యక్షుడిగా డోర్నకల్ మండలం గొల్లచర్ల జీపీవోగా పని చేస్తున్న కత్తుల రాజశేఖర్ ఎన్నికయ్యారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆవరణలో ఆదివారం జీపీవోలంతా సమావేశమై జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా గౌరవ అధ్యక్షురాలిగా సోమిరెడ్డి విజయ, ఉపాధ్యక్షులుగా తూళ్ల హుస్సేన్, జివ్వాజీ భిక్షపతి, ప్రధాన కార్యదర్శులుగా పాల్తియా అశోక్‌కుమార్, నాగెల్లి శేఖర్, సహాయ కార్యదర్శులుగా ఇస్లావత్ సుమన్, ఎస్కే. నాగూల్‌మీరా, షేక్. జానీ పాష, గౌరవ సలహాదారులుగా బియ్యం నర్సింహారావు, రావుల వీరభద్రం, కోశాధికారిగా గంగరబోయిన కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా వంగ మధు, నల్లబెల్లి కవిత, బోడ మంగిలాల్, దాసరి మహేశ్వర్ ఎన్నికయ్యారు.


కుక్కల దాడిలో గాయపడిన శ్రీనివాస్, వినయ్, భవిష్

కుక్కల స్వైరవిహారం

● ముగ్గురికి తీవ్ర గాయాలు.. జిల్లా ఆస్పత్రికి తరలింపు

● గోపాల్‌రావునగర్ కాలనీలలో ఘటన

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ శివారు కొండపల్లి గోపాల్‌రావునగర్ కాలనీలో ఆదివారం సాయంత్రం కుక్కలు స్వైరవిహారం చేసి, పలువురిని తీవ్రంగా గాయపరిచాయి. కొండపల్లి గోపాల్‌రావునగర్ కాలనీలో సాయంత్రం వేళలో రోడ్డు వెంట వెళ్తున్న పలువురిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. కాలనీలో నడుచుకుంటు వెళ్తున్న క్రమంలో అదే కాలనీకిచెందిన వెంగలి శ్రీనివాస్, కాగితం వినయ్, బాలుడు జాడి భవిష్‌ను తీవ్రంగా గాయపరిచాయి. వారిని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నందిస్తున్నారు. కాగా, కుక్కలు వరుసగా ప్రజలపై దాడిచేసి గాయపరిచినప్పటికి అధికారులు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని తక్షణమే కుక్కల నివారణకు చర్యలు తీసుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న కోరారు.


మన్‌కి బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నేతలు

'పటేల్ జయంతిని నిర్వహించాలి'

మహబూబాబాద్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిలో యువత, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీ నుంచి ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మన్‌కి బాత్ కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. ఆదివాసీ వీరుడు కుమరం భీం నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన తీరును వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యామవల్ శ్యాంసుందర్‌శర్మ, మాజీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, సింగారపు సతీష్, పురుషోత్తంలోయా, పల్లె సందీప్, హేమలోయా, పార్వతి పాల్గొన్నారు.


ర్యాలీకి అనుమతి లేదంటూ అడ్డుకుంటున్న పోలీసులు


మాట్లాడుతున్న ఆదివాసీ సంయుక్త కార్యాచరణ చైర్మన్ రామకృష్ణ

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

● ఆదివాసీ సంయుక్త కార్యాచరణ చైర్మన్ చుంచు రామకృష్ణ

నెహ్రూసెంటర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంయుక్త కార్యాచరణ చైర్మన్ చుంచు రామకృష్ణ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ కేంద్రంలోని ఆర్తి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన ఆదివాసీ ధర్మయుద్ధం సంబంధించిన సంయుక్త సమావేశం నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి అనుమతి లేకపోవడంతో అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో కాసేపు ఆదివాసీ, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన నోటీసులపై స్పందించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. బ్రిటీష్, నైజాంకు భయపడకుండా పోరాటాలు చేసిన ఆదివాసీల చరిత్రను గుర్తు చేశారు. 1976లో రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా విద్యాపరంగా లంబాడీలు వెనుకబడిన వారు అనే నేపంతో డీఎన్‌టీ (డీ నోటిఫైడ్ ట్రైబ్)గా ఎస్టీ జాబితాలో చేర్చడంతో అసలైన గొండు, కోయ, కోలం లాంటి 9 తెగలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు లభించే అన్ని రిజర్వేషన్లు, సదుపాయాలను లంబాడీలు పొందుతున్నారని, చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సాయికుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశం కల్పించాలి..

ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి మార్చ్ ఫాస్ట్ ర్యాలీని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కుమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ ర్యాలీకి అనుమతి లేకపోవడంతో పోలీసులకు, ఆదివాసీలకు మధ్య వాగ్వావాదం చోటు చేసుకుని తోపులాటకు దారి తీసింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రూప్-1తో సహా అన్ని ఉద్యోగాలు గిరిజనులకే వస్తున్నాయని, గిరిజన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆదివాసీలపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల స్థితిగతులను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగ, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలి

● ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి వెంకన్న

కేసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లిలో ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వందల ఎకరాల్లో లావణిపట్టాలు, నవాబ్‌జంగ్ పేరిట ఉన్న భూములు ఉన్నాయని తెలిపారు. వీటిని రైతులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నారని, అయితే పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడంలేదని తెలిపారు. 40 ఏళ్లకుపైగా సాగు చేసుకుంటున్న ఈ భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఈ పట్టాలను సాధించేందుకు గ్రామ రైతుల కమిటీని ఎండి.షబ్బీర్ కన్వీనర్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గుండ దుర్గేష్, అంకిరెడ్డి వీరన్న, రాంబాబు, సాయి, కాకి సంతోష్, నూకల వినోద పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

దంతాలపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దంతాలపల్లి నూతన మండల కల్లుగీత కార్మిక సంఘం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షుడిగా కారుపోతుల అనిల్, ఉపాధ్యక్షుడుగా నం పెట రమేష్, కార్యదర్శిగా గుండ్ల యాకన్న, గౌరవ అధ్యక్షుడుగా బుర్ర ముత్తు, సహాయకార్యదర్శిగా గుర్రం యాకన్న, కోశాధికారిగా కారుపోతుల ఉప్పలయ్య, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గునిగంటి మోహన్, నాయకులు అంతయ్య, లింగయ్య, పొడిశెట్టి భాస్కర్, గండి వెంకటనారాయణగౌడ్, కొత్త కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జేఏసీ కమిటీ ఎన్నిక


తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జేఏసీ కమిటీ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏఈజేఏసీ) జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ చైర్మన్ దారావత్ సికిందర్, జాయింట్ సెక్రటరీ కల్లెం పాపిరెడ్డి సమక్షంలో ఆదివారం సమావేశమై జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జిల్లోజు అశోక్, కన్వీనర్లుగా పెద్ది భాస్కర్, మహంకాళి మహేష్, కోచైర్మన్‌గా మచ్చ సతీష్, కోశాధికారిగా చిర్ర శ్రీనివాస్, మీడియా ఇంచార్జ్‌గా ఎస్‌కె.సత్తార్‌పాషా, వైస్‌చైర్మన్‌గా దయాకర్, సోమాని, ప్రశాంత్, బాలాజీ, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, ఉపేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.